



స్వరాజ్యరావు ఇంటినుంచి కూరల మార్కెట్‌కి రెండుఫర్లాంగుల దూరం ఉంటుంది. అయిదునిముషాల నడక.

సంచీ పట్టుకుని చకచకా నడుస్తున్నాడు స్వరాజ్యరావు. చేతిలోని సంచీ వూపుతూ. ఆరోజు రెండవ శనివారం. శెలవుదినం. కూరలు కొనుక్కు-రావడానికి వెళుతున్నాడు మార్కెట్‌కి, శనివారం కూరలు చవకగా దొరుకుతాయని మర్నాడు ఆదివారం మార్కెట్‌కి శెలవ. కాబట్టి నిలవ వుండవని కూరలు చవకగా అమ్మేస్తారు.

కూరలమార్కెట్ నాలుగడుగుల దూరంలో ఉండనగా ఆగిపోయాడు స్వరాజ్యరావు. చూపులు, మార్కెట్‌కి కొంచెం దూరంలోవున్న జనంమీదకి వెళ్ళాయి. దీర్ఘచతురస్రంగా నిలబడి ఉన్నారు మనుషులు. చెట్టు క్రింద. వాళ్ళ మధ్యనుంచి డప్పు చప్పుడు వినిపిస్తోంది. మధ్య మధ్యలో డమరుకు చప్పుడు. ఈలలు.

చూడంగానే గ్రహించగలిగాడు స్వరాజ్యరావు ఎందుకు అలా నిలబడి చూస్తున్నారో!

గావడీ!

వాళ్ళమధ్య గారడీవాడు తమాషాలు చేస్తున్నాడు. స్వరాజ్యరావు ఉత్సాహంతో పొంగిపోయాడు. చాలా రోజులయింది గారడీ ఆట చూసి.

స్వరాజ్యరావుకు గారడీ ఆటంటే చాలా ఇష్టం. ఎన్నో ఆటలు చూసాడు. ఎప్పుడు చూసినా, వాళ్ళుచేసే విచిత్రాలు కొత్తగానే ఉంటాయి. వినోదంగా ఉంటాయి. విసుగనిపించవు.

ఆరోజు సెలవుదినమే గాబట్టి, త్వరగా అన్నంతిని ఆఫీసుకి వెళ్ళా లనే తొందర లేదు. అప్రయత్నంగా ఆ గుంపువైపు నడిచాడు, ఆట చూడ టానికి.

ప్రేక్షకులలో చాలామంది లోక్లాస్‌కి సంబంధించినవాళ్ళు. వాళ్ళే ఎక్కువగా ఆనందిస్తున్నారు. స్వరాజ్యరావులాంటి చదువుకున్న వాళ్ళుచాలా తక్కువ.

చిన్నప్పుడు స్కూలుకు వెళ్ళేటప్పుడయినా, స్కూలునుంచి తిరిగి వచ్చేటప్పుడయినా గారడీ ఆట పూర్తయ్యేదాకా చూసి కాని మరీ కదిలేవాడు కాదు. అంత సరదా స్వరాజ్యరావుకి.

చిన్నపిల్లలందరూ ముందు చుట్టూ కూర్చుని ఉన్నారు. పెద్దవాళ్ళు వెనకాల నిలబడి చూస్తున్నారు. ఆ మనుష్యుల మధ్య గారడీవాడు ఒకవైపు వాడి సహాయకుడు మరోవైపు నిలబడి ఉన్నారు, అందరూ వినేటట్లుగా, గట్టిగా మాట్లాడుకుంటూ.

స్వరాజ్యరావు గారడీవాడు అమర్చిన సామానువంక చూశాడు. ఆ సామానుచూసి గ్రహించగలిగాడు స్వరాజ్యరావు, ఏ ఏ ప్రదర్శనలు ఇస్తాడో.

ఒకమూల మనిషి పుర్రె. దాని నోట్లో అంటించని కొత్తసిగరెట్ ఆ పుర్రెకి సూటిగా వరసగా పేర్చిన రక రకాల ఎముకలు. మధ్యలో నేలలో కొట్టిన మేకుకు కట్టివున్న ముంగీస, ప్రక్కనే రెండు పాములుంచే బుట్టలు. ఆ బుట్టలప్రక్కన ఒక బక్కెట్టు. పాములు ఆడించే నాగస్వరం. మాసిపోయిన గుడ్డతో కట్టిన రెండు మూటలు. నాలుగు కత్తులు.

గారడీ చేసేవాడి వెనకాల కట్టివున్న గుర్రం ఎందుకో అర్థంకాలేదు. స్వరాజ్యరావుకి. ఎప్పుడూ గారడీ ఆటల్లో గుర్రాన్ని చూడలేదు. బహుశా కొత్తఖీట్ ఏదయినా ఉండవచ్చు, తను ఇంతక్రితం చూడనిది అనుకున్నాడు.

బక్కచిక్కిపోయి ఉంది ఆ గుర్రం. బండిలాగే శక్తికూడా దానికి లేదు అని చూడగానే తెలుస్తుంది, స్పష్టంగా. బాగా ముసలిదిగా ఉంది. ఆ గుర్రానికి రెండు వైపులా గవ్వలు కట్టి ఉన్నాయి. క్రిందవున్న గడ్డి తింటోంది అది.

ఆట ప్రారంభం అయి చాలాసేపు అయినట్లుగా ఉంది. గారడీవాడి సహాయకుడికీ, గారడీవాడికీ సంభాషణ నడుస్తోంది.

"ఎంత డబ్బు కావాలి నీకు?" అడుగుతున్నాడు గారడీవాడు.

"అయిదు వందలు."

"ఇందాక వంద చాలన్నావు. ఇప్పుడు అయిదు వందలు అంటున్నావు?"

"అవును అయిదువందలు కావాలి."

"దేనికి?"

"పెళ్ళి చేసుకుంటాను."

"వీడికి పెళ్ళా?" అన్నాడు గారడీవాడు ప్రేక్షకులవైపు తిరిగి. కుడిచేతిలోవున్న ఎముకతో, తన సహాయకుని అందరికీ చూపిస్తూ.

అందరూ నవ్వారు.

"సరే! అయిదువందల రూపాయలా? డాలర్లా?"

అడిగాడు గారడీవాడు.

"రూపాయలు."

"సరే! అయిదువందల రూపాయల నోట్లూ తెప్పిస్తాను. ఇది రెండు చేతుల్లో పట్టుకుని చేతులు రెండూ గట్టిగా మూయి."

చిన్నగవ్వ అందరికీ చూపించి, తన సహాయకుడికి ఇచ్చాడు. సహా

యకుడు గవ్వ చేతుల్లో పట్టుకుని, "అయిదువందల రూపాయలనోటు ఎలా తెప్పిస్తావు? అసలు ఉండదుగా?" అని అడిగాడు, అనుమానంగా.

"మంత్రంతో తెప్పిస్తాను. గట్టిగా పట్టుకున్నావా? ఇప్పుడు ఆ పుర్రె చుట్టూ నీ రెండుచేతులూ మూడుసార్లు తిప్పు."

సహాయకుడు అలాగే తిప్పాడు. కుడివైపు మూడుసార్లు, పుర్రెచుట్టూ తన చేతులని.

చేతులోని ఎముక, గారడీవాడు, సహాయకుడి చేతులవంక చూపిస్తూ ఏదోమంత్రం చదివాడు.

"ఇప్పుడు తెరు. చేతిలో అయిదువందల రూపాయల నోటు ఉంటుంది."

ప్రేక్షకులు అందరూ సహాయకుడు బిగించిన చేతులవంక చూసారు, నోటు తయారయిందేమోనని.

"ఏమయ్యోయ్! నా చేతులు రావటంలేదు. ఏం చేసావు?"

సహాయకుడు చేతులు విడదీయడానికి బ్రహ్మప్రయత్నం చేస్తున్నాడు. కాని విడివడటంలేదు అవి.

"ఎందుకురావు వస్తాయి."

"అరె! అతుక్కుపొయ్యాయి. నువ్వే ఏదో చేసావు విడదియ్యి."

గారడీవాడి మీదకి వచ్చాడు. విడివడని చేతులతో, సహాయకుడు.

"నీ చేతులు నువ్వు పట్టుకుని, నన్ను తియ్యమంటావే."

"నువ్వే ఏదో చేసావు తియ్యి" అరిచాడు సహాయకుడు.

"నేనేం చేసాను. వీళ్ళంతా చూడటంలా? కావాలంటే అడుగు వాళ్ళనే?"

ప్రేక్షకులవంక చూపించాడు. చేత్తో గారడీవాడు.

"నాకు డబ్బువద్దు, పెళ్ళివద్దు. చేతులు విడదియ్యి"

బాగా నటిస్తున్నాడు సహాయకుడు, చేతులు విడదీసుకోవాలని చేసే ప్రయత్నం కోసం.

ప్రేక్షకులు నవ్వుతున్నారు, వాళ్ళమధ్య వివాదానికి.

"నవ్వకండయ్యా. ఎందుకు నవ్వుతారు. చేతులు విడదీయి బే" అరుస్తున్నాడు సహాయకుడు.

"తిట్టుకో. డోంట్ కేర్. ఇప్పుడు చూడండి. వీడికి పెళ్ళిచేద్దాము."

గారడీవాడు ఏదో మంత్రం చదివి, ఎముక సహాయకుడి నెత్తిమీద తిప్పాడు.

అందరూ విచిత్రం చూస్తున్నారు.

"మొదలు పెడుతున్నాను పెళ్ళి."

ఎముకతో నెమ్మదిగా తన నెత్తిమీద కొట్టుకున్నాడు గారడీవాడు.

"కొట్టకు బే" అరిచాడు సహాయకుడు. తన తలమీద మళ్ళీ కొట్టుకున్నాడు గారడీవాడు నవ్వుతూ. తల విదిలించాడు సహాయకుడు. "కొట్టకు బే. నీకే చెప్పేది. చేతులు కట్టేసి, పెళ్ళిచేస్తానని, కొడతావా."

ప్రేక్షకుల కందరికీ అర్థమయింది, గారడీవాడు ఏదో మంత్రం వేసాడని. తన నెత్తిమీద కొట్టుకొంటున్న దెబ్బ సహాయకుడికి తగులుతోందని.

సహాయకుడు ఆ పుర్రెదగ్గరకి వెళ్ళి మళ్ళీ అతుక్కుపోయిన రెండు చేతులూ దానిచుట్టూ మూడుసార్లు తిప్పాడు అయినా విడివడలేదు.

ప్రేక్షకులు ఘొల్లున నవ్వారు.

మళ్ళీ గారడీవాడి దగ్గరకి వెళ్ళాడు కోపంగా, చేతులు విడదీయమంటూ.

కాస్సేపు అందరూ వినోదించిన తర్వాత మళ్ళీ మంత్రం చదివి విడదీసాడు, సహాయకుడి చేతులు, గారడీవాడు.

అయిదువందల రూపాయలనోటు సంగతి అంతా మరిచిపోయారు.

"మీ దగ్గర ఎవరి దగ్గరయినా తినేందుకు ఏమయినా ఉందా? బాగా

ఆకలివేస్తోంది నాకు?" అని చుట్టూ చూసి, "ఎవరిదగ్గరా ఏమీలేదా? ఏరా? నీ దగ్గరేమయినా ఉందా?" అని అడిగాడు సహాయకుడి వంకచూసి.

"ఆ. ఇది తిను."

ఒక మూలవున్న ఒక కత్తి తీసి అందించాడు. సహాయకుడు కోపంగా,

"సరే! అలాగే తింటాను. ఏవీ. నీ చేతులు రెండూ మళ్ళీ దగ్గర పెట్టు" అన్నాడు ఎముకతో తడుతూ.

బెదిరిపోయినట్లుగా నటించాడు సహాయకుడు. "వద్దు. మళ్ళీ చెయ్యొద్దు." అన్నాడు రెండు చేతులూ, రెండు జేబుల్లో దాచుకుని.

స్వరాజ్యరావు నవ్వుకున్నాడు.

"మీరు అంతా చూశారుగా. ఈ కత్తి తినమని ఇచ్చాడు వీడు. తిన లేనని అనుకొని. ఈ కత్తి మీ అందరి కళ్ళముందూ మింగుతాను. జాగ్రత్తగా చూడండి. ఒక కత్తి కాదు. రెండు తింటాను."

ప్రక్కనే వున్న ఇంకో కత్తి అందుకున్నాడు.

స్వరాజ్యరావు కత్తులవంక చూశాడు జాగ్రత్తగా. చాలా పలచగా ఉన్నాయి, రేకుల్లా. అడుగుపైనే ఉంది పొడవు.

గారడీవాడు రెండు కత్తుల చివరలూ నోటిలో పెట్టి నెమ్మదిగా లోపలికి పోనించ సాగాడు కత్తులని. అందరూ వూపిరి బిగబట్టి చూస్తు న్నారు. రెండు కత్తులూ పూర్తిగా లోపలికి వెళ్ళిపొయ్యాయి, పిడిదాకా.

గారడీవాడు చుటూ తిరిగి, అందరికీ చూపించాడు. తర్వాత నెమ్మదిగా కత్తులని మళ్ళీ బయటికి తీసాడు, నోట్లోనుంచి.

ఆశ్చర్యంగా చూస్తున్న సహాయకుడికి నోరుతెరచి చూపించాడు ఏమీ కాలేదన్నట్లుగా. స్వరాజ్యరావు చాలారోజులక్రితం చూసాడు, కత్తులు మింగే వాణ్ణి. మళ్ళీ ఇప్పుడే. చాలా తక్కువమంది చేస్తారు అది. సన్నగా రేకుల్లా ఉండే ఆ కత్తులు గొంతులోకి పోకుండా, నోట్లోనే చుట్టుకునేలా చేస్తారు, అనుకున్నాడు స్వరాజ్యరావు.

గారడీవాడు పొట్ట తడుముకుని "ఇంకా ఆకలి తీరలేదు. ఇంకే

దయినా ఉందా తినడానికి?" అని అడిగాడు తన సహాయకుడివంక చూసి. సహాయకుడు కాస్సేపు చుట్టూవున్న సామాను వెతికినట్లుగా నటించి, బక్కెట్టు తీసి గారడీవాడికి చూపించి "ఇది తిను" అన్నాడు

గారడీవాడు బక్కెట్టులోంచి చిన్నపాముని బయటకి తీసాడు. అందరూ భయంగా చూసారు దానివంక. చేతి చూపుడువేలు అంత సన్నగా వున్న ఆ పాము అడుగున్నరదాకా ఉంది పొడవు.

"ఇది తినమంటే తింటాను" అని చేతిలోనిపాముని చుట్టూతిప్పి అందరికీ చూపించాడు.

ఎడంచేత్తో డమరుకు అందుకుని అది గబగబా వాయించి, రెండు వేళ్ళు పెట్టి గట్టిగా ఈలవేశాడు గారడీవాడు. లేచి నిలబడ్డ చిన్నపిల్లలని కూర్చోమని సహాయకుడు అందించిన గిన్నెలోని నీళ్ళు ఎత్తి నోట్లోపోసుకున్నాడు. మింగలేదు ఆ నీళ్ళు. మింగకుండానే ఆ పాముని నోట్లోవేసుకుని, పాముతోపాటు మింగాడు నీళ్ళు.

నోరు తెరచి అందరికీ చూపించాడు. నోట్లోలేవు నీళ్ళుకానీ, పాముకానీ. కడుపులోకి వెళ్ళిపొయాయి. గారడీవాడి సహాయకుడు ఆశ్చర్యం నటిస్తూ చూడసాగాడు.

మళ్ళ బయటకి తెప్పించాడు గారడీవాడు పాముని, నోట్లోంచి. ఈసారి రెండు పాములని ఒకేసారి మింగి మళ్ళీ తెప్పించాడు.

మళ్ళీ రెండు తేళ్ళని తీసాడు, బక్కెట్టులోంచి. పాములని వదేసి. అవి మింగి మళ్ళీ తెప్పించాడు నోట్లోంచి బయటికి.

"ఇంకా ఆకలి తీరలేదు. ఇంకేంవుంది?" అడిగాడు గారడీవాడు సహాయకుడి వంక తిరిగి.

"వాడు కత్తులు, పాములూ మింగినా బ్రతికే ఉన్నాడు. ఇంకా ఆకలిట. బకాసురిడి అన్నలాగా ఉన్నాడు." అన్నాడు సహాయకుడు, ప్రేక్షకులవంక చూస్తూ.

అందరూ నవ్వారు.

"ఆకలి వేస్తోంది. నిన్నేతినేస్తాను"

సహాయకుడు వెనక్కి పరిగెత్తాడు.

"నన్ను తినొద్దు, వద్దు" అన్నాడు కంగారు నటిస్తూ.

"మరయితే ఏం తినను?"

సహాయకుడు కాస్సేపు సామాను వెతికి చిన్ననిమ్మకాయ బయటికి తీసాడు.

"ఇది తిను"

రెండువేళ్ళ కత్తెరలాగా ఉపయోగించి, ఆ నిమ్మకాయని కత్తిరించాడు గారడీవాడు, మధ్యకి.

"ఇది చాలదు" అన్నాడు, అని నేలకేసికొట్టి.

"అయితే ఆ గుర్రాన్ని తిను."

ప్రక్కనే ఓ మూలగా పచ్చిగడ్డి మేస్తున్న గుర్రాన్ని చూపించాడు సహాయకుడు.

"గుర్రం తినటానికికాదు, ఎక్కి పరిగెత్తడానికి."

"అయితే ఎక్కి పరిగెత్తు నేలమీదకాదు. ఆకాశంలో. నీ మంత్రమేమిటోబయట పడుతుంది."

"నిజంగా ఆకాశంలోకి ఎగరమంటావా?" అడిగాడు గారడీవాడు సహాయకుడిని.

"నువ్వొక్కడివే కాదు. ఆ గుర్రంతోపాటు ఎగురు."

"ఎగురగలను ఎగరనా?

అడిగాడు గారడీవాడు ప్రేక్షకులనుద్దేశించి.

"ఎగురు", అరిచాడు ముందుకూర్చున్న పిల్లలు ఉత్సాహంగా వాళ్ళ అరుపులలో స్వరాజ్యరావు అరుపుకూడా కలిసిపోయింది.

"సరే. మీరందరూ అడుగుతున్నారు కాబట్టి, నేను, ఈ గుర్రంమీద ఎక్కి ఆకాశంలో ఎగురుతాను. ఇలా గుర్రంమీద ఎగరగల మంత్రం మా గురువుగారి దగ్గర నేర్చుకున్నాను. ఆయన ఎవరని మీ రెవరయినా అడగవచ్చు. రెండు సంవత్సరాలదాకా హిమాలయ పర్వతాలలో తపస్సు చేస్తూండేవారు. ఇప్పుడు విదేశాలలో ఉన్నారు. చాలా గొప్పవారు ఆయన. మీరు పేపర్లలో చదివే ఉంటారు ఆయనగురించి. సినిమాలలో చూసేవుంటారు. ఆయన ఫోటో నాదగ్గరవుంది, చూపించనా?"

అడిగాడు అందరివంకా చూస్తూ.

"చూపించు" అన్నారు ముందర కూర్చున్న పిల్లలు.

"చూపిస్తాను. అందరికీ చూపిస్తాను. ప్రతీఒక్కరూ, ఆయన ఫోటోకి దణ్ణం పెట్టాలి, మీ దగ్గిరకు ఫోటో వచ్చినప్పుడు. లేకపోతే మీకందరికీ కీడు జరుగుతుంది"

మూటలోంచి ఒకఫోటోతీసి పట్టుకుని, ప్రేక్షకులకి ఫోటో చూపిస్తూ చుట్టూ తిరిగాడు. స్వరాజ్యరావు తనదగ్గిరికి రాగానే, ఎందుకయినా మంచిదని నమస్కారం పెట్టాడు, తనఆఫీసర్‌కు ట్రాన్స్‌ఫర్ అయేవిధంగా చూడమని, మనసులో అనుకుని.

సహాయకుడు మధ్య ఒక తెల్లగుడ్డ పరిచాడు. గారడీవాడు ఆ గుడ్డ మీద పెట్టాడు ఫోటోని.

"నేను యాచించటానికి రాలేదు. అయినా అడుగుతున్నాను. మీకు తోచిన ధర్మం మీరు చెయ్యండి. ఇంతవరకూ ఎన్నోవింతలు చూపించాను. మీకు ఇప్పుడు ఇంకా అద్భుతమయిన వింతను చూపించబోతున్నాను. ఎవరికి తోచిన డబ్బు వాళ్ళు ఆ గుడ్డమీద పడేయండి. మనసులో మా గురువుగారికి నమస్కరించి మీరు ఏ కోరిక కోరుకుని డబ్బు వేసే ఆ కోరిక నెరవేరుతుంది. మీరు విసరిన నాణెం ఫోటోకి తగిలితే మీ కోరిక ఫలిస్తుంది. లేకపోతే లేదు. ఇది మా గురువుగారి ఆజ్ఞ."

గారడీవాడు ఇవే మాటలు చెప్పాడు నాలుగయిదుసార్లు, డమరుకు వాయిస్తూ, చుట్టూ తిరుగుతూ.

చాలామంది డబ్బు విసరుతున్నారు ఫోటోవైపు, అయిదు పైసల నుంచి, మడతపెట్టిన రూపాయినోట్లదాకా వచ్చి పడుతున్నాయి పరచివున్న తెల్లగుడ్డ మీద.

స్వరాజ్యరావు కూడా, తన ఆఫీసర్‌కు ట్రాన్స్‌ఫర్ అవాలి అని మనసులో అనుకుని, అర్ధరూపాయిబిళ్ళ విసిరాడు గురిచూసి, వెళ్ళి ఫోటోకి తగిలింది అది సరిగ్గా.

కాస్సేపటికి డబ్బు పడటం ఆగిపోయింది. అంతా గారడీవాడువంక చూస్తున్నారు. ఎప్పుడు గుర్రంమీద ఎగురుతాడా అని.

ప్రేక్షకులలో ఒకమూల మాత్రం ఇద్దరు వాదులాడుకోవటం అంద రికీ వినిపిస్తోంది, ఏదో ఆస్తి విషయంలో.

గారడీవాడి సహాయకుడు జాగ్రత్తగా డబ్బు ఆ గుడ్డలోనే మూట కట్టాడు, నాలుగు చివరలూ కలిపి. సామానంతా సర్దసాగాడు, చకచకా.

గారడీవాడు గుర్రం దగ్గరకి వెళ్ళి ఆగి అన్నాడు.

"ఇప్పటిదాకా మీరు ఎన్నో గారడీలు చూసి ఉంటారు కాని ఇలాంటి తమాషా ఎక్కడా చూసి ఉండరు ఈ గుర్రంమీద ఎక్కి, పైకి ఎగురుతాను, మీ అందరి కళ్ళముందూ. పైన మూడుసార్లు చుట్టూ తిరిగి, మీరు చూస్తుండ గానే, మళ్ళీ సరిగ్గా ఇక్కడే దిగుతాను. ఇది కనికట్టు విద్య కాదు. నిజంగా ఎగురుతాను."

చేతిలోని డమరుకు వాయించి, గట్టిగా ఈలవేసి, ఎముకతో గుర్రా నికి కట్టిఉన్న గవ్వలని ముట్టుకుని కళ్ళుమూసుకుని ఏదో మంత్రం చదవ సాగాడు.

వాదులాడుకుంటున్న ఇద్దరి గొంతులూ గట్టిగా వినబడుతున్నాయి.

గారడీవాడు కళ్ళు తెరచి వాళ్ళవైపు చూసి "నిశ్శబ్దంగా ఉండండి" అన్నాడు. గుర్రంచుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి, గుర్రం ఎక్కి కూర్చున్నాడు.

అంతా వూపిరి బిగపట్టి చూస్తున్నారు, ఎలా గుర్రంతో పాటు ఆ గారడీవాడు ఎగురుతాడా అని.

"చప్పట్లు కొట్టండి"

గారడీవాడు చెప్పగానే, ముందు కూర్చున్న పిల్లలేకాదు. పెద్దవాళ్ళు కూడా చప్పట్లు కొట్టారు, స్వరాజ్యరావుతో సహా.

"ఇంక పైకి ఎ...."

"క్యా బే. నా యాలా, నీ అంతు తేలుస్తాను."

ఇందాకటినుంచి వాదులాడుకుంటున్న వాళ్ళలో ఒకడు, మధ్యకిదూకి, ఇందాకా గారడీవాడు ఉపయోగించిన కత్తులలో ఒకదాన్ని అందుకొని, రెండవవాడి వైపు ఉరికాడు పొడవడానికి.

గబుక్కున గుర్రంమీద నుంచి క్రిందకి దూకి, పొడవబోతున్న వాణ్ణి ఒడిసి పట్టుకున్నాడు గారడీవాడు. ప్రేక్షకులలో ఇద్దరు సహాయం చేయగా, వాడిచేతిలోంచి కత్తి బలవంతంగా లాక్కున్నాడు గారడీవాడు.

గింజుకుంటూ అరుస్తున్నాడు వాడు. పోలీసులకి అప్పగించండి అన్నారు కొందరు.

“నందిగామాలో ఒకరోజు ఇలాగే ప్రదర్శనం ఇస్తూంటే, నా కత్తితో ఒకడు ఇంకొకడిని పొడిచేసాడు. తర్వాత కోర్టుచుట్టూ తిరగాల్సి వచ్చింది నేను, పోలీసులు వద్దు. వదిలేయండి.”

ఖంగారుగా సామాను సర్ది, ఇద్దరూ గుర్రంమీదకి ఎక్కారు తమ సరంజామా అంతా, నిమిషాలలో.

గారడీవాడు వెళ్ళిపోగానే క్రమంగా అంతా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. ఆట మధ్యలో చెడగొట్టిన వాడిని తిట్టుకుంటూ.

స్వరాజ్యరావుకి కూరలుమీదకి లాగటం లేదు ఇప్పుడు మనసు. గారడీవాడు ఆఖరున చేసి చూపిస్తానన్న అంశంమీదకి లాగుతోంది. ఇంత వరకు అది తను ఎక్కడా చూడలేదు.

నెమ్మదిగా, ఖాళీ సంచితో, దూరంగా పోతున్న గారడీవాడి వైపు నడవసాగాడు స్వరాజ్యరావు. గుర్రంతో ఎలా ఎగరగలడు గాలిలోలా గ్రావిటీ థియరీ ప్రకారం అది అసంభవం. గారడీవాడు అసాధ్యుడిగాక? ఉన్నాడు. చేసినా చేయగలడు మంత్రాలతో. నిజంగా మంత్రాలు వచ్చేమో వాడికి.

వాడిని కొద్ది దూరంలో అనుసరించ సాగాడు ఆలోచిస్తూ.
చిన్నప్పుడు జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది స్వరాజ్యరావుకి.

ఒకసారి, ఆదివారం, మంగలిషాపుకి వెళ్ళిక్షవరం చేయించుకు రమ్మని పావలా ఇచ్చి పంపాడు నాన్న వెళ్ళేదారిలో గారడీ జరుగుతూంటే, ఆగిపోయాడు చూస్తూ.

“మీ దగ్గరవున్న డబ్బు నాకు ఇవ్వకపోతే, మీరు ఇంటికివెళ్ళే

లోపల చచ్చిపోతారు. లేదా ఇవ్వాళ రాత్రి, సరిగ్గా పన్నెండు గంటలకి ఈ పాము వచ్చి మిమ్మల్ని కాటేస్తుంది?"

ఒక బుస్సు బుసకొట్టే పాముని చూపించాడు. తను భయపడి, పావలాకాసు వాడి మీదకి విసిరేసి, ఇంటికి పరిగెత్తుకెళ్ళాడు. జరిగింది విని కోపంవచ్చింది నాన్నకి. ఆ నెలంతా తను క్షవరం చేయించుకోలేదు. తర్వాత నెలలో గుండుచేయించాడు నాన్న. పావలా పోగొట్టావన్న కోపంతో.

స్వరాజ్యరావు అనుకున్నట్లుగానే, ఒక సినిమా థియేటర్ దగ్గర ఆగాడు గారడీవాడు. ఒకచోట గుర్రంమీద సామాను దింపి, మళ్ళీ ఆట మొదలుపెట్టడానికి సిద్ధం అయ్యాడు.

స్వరాజ్యరావు కూడా చుట్టూ చేరినవాళ్ళలో కలిసిపోయి చూడ సాగాడు ఆట.

చాలాభాగం ఆట ఇందాక జరిగినట్టు గానే జరిగింది, కొద్దిపాటి తేడాతో. తన ఆఫీసర్‌కి ట్రాన్స్‌ఫర్ కావాలని మళ్ళీ అర్ధరూపాయి కాసు విసిరాడు. సరిగ్గా ఫోటోకి తగిలింది అర్ధరూపాయ బిళ్ళ.

గుర్రంమీద ఎక్కాడు గారడీవాడు, గుర్రంచుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి చిన్నపిల్లల్ని చప్పట్లు కొట్టమన్నాడు.

అందరితోపాటు మళ్ళీ చప్పట్లుకొట్టాడు స్వరాజ్యరావు గట్టిగా.

అప్పటిదాకా నెమ్మదిగా కీచులాడుకుంటున్న ఇద్దరిలో ఒకడు అందరి మధ్యకు దూకి "క్యాదే. నాయాల. నీ అంతు తేలుస్తాను" అన్నాడు. గారడీవాడు కత్తి అందుకుని.

గారడీవాడు గుర్రం మీద నుంచి దూకి, వాడిచేతులోకత్తి లాక్కో పటం, ఇదివరకు నందిగామలో ఇలాగే ఒక సంఘటన జరగడం తను కోర్టుచుట్టూ తిరిగిన సంఘటన చెప్పటం జరిగిపోయింది.

ఆశ్చర్యంగా చూస్తున్నాడు స్వరాజ్యరావు, కత్తి పట్టుకున్నవాడిని.

ఇందాకటి వాడేవాడు. ఇందాక మార్కెట్ దగ్గర జరిగిన ఆటలో కూడా, అందరి మధ్యకీ దూకి, కత్తి అందుకుని, పొడవడానికి సిద్ధమయింది వాడే.

సామాను సర్దుకుని వెళ్ళిపోతున్న గారడీ వాడిని చూసి నవ్వుకున్నాడు స్వరాజ్యరావు.

గారడీవాడు చాలా తెలివైనవాడు. నిజానికి అ గుర్రంమీద కూర్చుని ఎగరలేడు అంతశక్తి లేదు. కాని అలా ఎగరగలనని చెప్పి, అందరిదగ్గరా డబ్బు వసూలు చేసి, చివరికి గుర్రంమీద ఎగరలేకపోతే తంతారు, డబ్బు లాక్కుంటారు.

అలా జరుగకుండా ఉండడానికి ఈ ఏర్పాటు చేసుకున్నాడు. పైకి ఎగురుతాడని భావించే సమయానికి తన మనుషులలో ఒకడయినవాడు గొడవ చేస్తాడు కత్తి అందుకొని. చాలామంది బెదిరి వెళ్ళిపోతారు.

గారడీవాడు చల్లగా జారుకోవచ్చు.

ఆ గలాభాయాడా ఆటలోని భాగమేనని స్వరాజ్యరావు తేలికగా గ్రహించగలిగాడు. గారడీవెంట కొంత దూరంలో, నడుస్తున్న వాడిని చూస్తూ.

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక 26-5-1972)